

**చస్తే వార్త**

**బతికితే చీకటే...**

ఆకాశంలో జరిగే ప్రతి మార్పునీ సాదరంగా లోపలికి ఆహ్వానించే ఉదారస్వభావం ఆ గుడిసె కప్పుకుంది. అందుకు దానిని అభినందించాలో... లేక అందులోని వారిపై కక్షకట్టే అలా చేస్తున్నందుకు దాన్ని ద్వేషించాలో....

ఆ విరుగు గుడిసెలో వుండే ముగ్గురు మనుషులతో సంబంధమున్న ఒకే ఒక కుక్క మాత్రం ఆ ఛాయల్లోనే తిరుగుతూంటుంది. కాసింత తిండికోసం అలా తిరుగుతోందో... ఏనాడో తిన్నదానికి విశ్వాసమో...

ఆ పరిసరాల్లోనే ఓ కాలువ.

నెమ్మదిగా, పేదవాడి జీవితంలా కదలనా, వద్దా అన్నట్లుండే నీరు మురికినీరు అక్కడేవున్న గట్టుమీద కూర్చుని ఆలోచిస్తున్నాడు ఆ 'గుడిసె' వంశోద్ధారకుడు వెంకటేశం. అతనూ ఆలోచించగలడు.

మెడమీద తలకాయ వున్నందుకు అనేకం పే కడుపులో ప్రేగులున్నందుకు, అవి అనుమానం ఆకలి కేకలు వేస్తున్నందుకు అంతే సమంజసంగా వుంటుంది.

వెంకటేశానికి కక్ష.

ఎవరిమీదో కాదు. తనమీదే తన కడుపులోని ఆకలి మీదే. దానిని చంపేయాలని చాలా సార్లు అనుకున్నాడు. కానీ చేతకాలేదు.

ఆ నిస్సహాయతని చాలాసార్లు చూసి పరామర్శిస్తుంటాయి కన్నీళ్ళు.

అలా అవి వచ్చినప్పుడు గుండెనెవరో అరచేతిలోకి తీసుకుని బలంగా నలిపినట్లు అవుతుంది వెంకటేశానికి.

లోకంలో తనొక్కడే అసమర్థుడా.

లేదు తనలాంటి వాళ్ళు ఇంకా వున్నారు.

'పేదుపు పండాలి' అని అనుకోవడమూ ... ఈ పుణ్యధరిత్రిలో.

ఇటువంటి ఆలోచనలు ముసిరినప్పుడు ఆ బాధను మరొకరి దగ్గర, కనీసం తల్లిదగ్గరో, చెల్లి దగ్గరో కూడా విప్పి చెప్పుకోలేదు. అందుకే తనని చూసి తోకాడించే తన కుక్కని దగ్గరికి

తీసుకుని బాపురు మంటుంటాడు చేతకాక ఏమీ చేయలేక.

***         ***         ***

సింహాచలం కిళ్ళీకొట్టు చాలా పెద్దది ఆ ప్రాంతంలో అనేకంటే బాగా పేరున్నది అంటే బావుంటుంది.

కట్టేది కిళ్ళియే అయినా కొట్టేది సోడాయే అయినా అక్కడ చాలా వ్యాపారాలు జరుగుతుంటాయి. అమెరికాలో తయారైన గుండు సూదిని తెప్పించగలడు సింహాచలం.

ఒంట్లో వేడిపుట్టించే పుస్తకాలు దొరుకుతాయి.

పుట్టించిన వేడిని చల్లార్చడానికి కావల్సిన అడ్రస్సులు దొరుకుతాయి. కార్లలోంచి కార్పెట్లమీద తప్ప కాలు మరెక్కడా పెట్టని వాళ్ళకీ, కాలినడకే తప్ప మరొకటి తెలియని వాళ్ళకీ కూడా సింహాచలం తెలుసు.

చుట్టుపక్కల వున్న చాలా ఇళ్ళు సింహాచలానివే. చాలా ఇళ్ళల్లో వారితో కూడా సంబంధం లేకపోలేదు. 'భర్త' అని చెప్పుకోలేక పోయినవాళ్ల సంగతి ఎందుకుగానీ 'తండ్రి' అని వేలెట్టి నిజం చూపించగలిగే ధైర్యంగల వాళ్ళా ఎవరూ లేరు.

రెక్కాడితేగాని డొక్కాడదని కొన్నాళ్ళు వెంకటేశం తన రెక్కల్ని సింహాచలం కిళ్ళికొట్టుకు తాకట్టు పెట్టేశాడు 'మీ ఇష్టం వచ్చినట్లు ఆడించుకోండి' అన్నదాంతో వాడు ఇచ్చిన స్వాతంత్ర్యానికి పొంగిపోయి రోజూ కొన్ని తిట్లు, వారానికో ఇరవై చేతిలో పడేసేవాడు.

బియ్యం కోసమని ఎదురుచూడకుండా వున్న కిరాణాకొట్టుకు వచ్చింది చెల్లి భారతి.

''పిట్ట భలే పిటపిటలాడిపోతోందిరోయ్'' అన్నాడు నర్సిములు.

''మన వెంకటేశుగాడు ఏం వేసి పెడుతున్నాడోగానీ ఈ మధ్య మరీ నును పెక్కిపోతోంది. ఏం రా....'' సింహాచలమే మొరిగాడు.

దానికి సమాధానం ఎరుపెక్కిన వెంకటేశు కళ్ళు... తన అసమర్థతకి అవి కార్చే నీళ్ళు.

అయినా సర్కస్ కుక్కలా పనేస్తునే వున్నాడు వెంకటేశం.

ఆ రోజు—

''ఒరేయ్ బక్కోడా. నేనొకటడుగుతాను చెప్తావురా'' సింహాచలం ఆప్యాయం ఒలికబోశాడు.

ఏమిటన్నట్లు చూశాడు వెంకటేశం.

''తినడానికే చాలనోడివి. కష్టపడలేని బక్కోడివి. మీ భారతికి పెళ్ళేం చేయగలవురా. అది కలలు కనడంతోటే ముసిల్దయి పోతుంది. అప్పుడేం లాభం చెప్పు. అందుకే నే చెప్పేదేమిటంటే దాన్ని రోజూ నా దగ్గరికి పంపించు. ఇరవై చొప్పున ఇస్తాను. నువ్వు ఎన్ని రోజులు పనేసి ఏడిస్తే వస్తుంది చెప్పు. నీ భారతి ఒక్క రాత్రి చాలు''

చెంప ఛెళ్ళుమనిపించింది 'పౌరుషం'

పనిలోంచి తీసేసింది 'అధికారం'

ఆ 'అధికారం' ఇంకా ఏమైనా చేయగలుగుతుంది. కానీ ఆ పౌరుషం మళ్ళీ పని సంపాదించగలుగుతుందా?

***         ***         ***

వెంకటేశం మళ్ళీ ఆలోచిస్తున్నాడు.

డబ్బుకోసం...

'విద్యలేని వాడు వింతపశువు' అన్నమాట వెంకటేశం ఎప్పుడూ వినివుండక పోవచ్చును. కానీ డబ్బులేని వాడి పని పశువు కంటే హీనం అనే నిజాన్ని తెలుసుకున్నాడు.

జబ్బుచేస్తే ఊరుకోకుండా అమ్మని గవర్నమెంటాసుపత్రిలో చేర్చడం, అసలు అమ్మ పోవడంతో పెద్ద దిక్కులేకుండా అయింది.

ఇంజినీరు బాబు వాళ్ళు వుండగా అయితే వాళ్ళింట్లో బియ్యం ఏరి, పాలు తీసుకొచ్చి ఏవో చిన్న చిన్న పనులు చేసి సంపాదించేది భారతి. ఆ డబ్బులతో, వాళ్ళ మంచితనంతో తమ కడుపులు నిండేవి. వాళ్ళకి ట్రాన్స్‌ఫర్ అయి చాలాదూరం వెళ్ళిపోయారు. వెళ్ళిపోయి రెండురోజులయింది.

భోంచేసి రెండు రోజులయింది—

నిజమే—భారతి వెళ్ళి ఆ శాంతి హోటల్లో బియ్యం బాగుచేయడానికి వెడతానంటే తనే వద్దన్నాడు. ఎందుకో తెలిసినా తను చెల్లికి చెప్పలేదు ముందు. కానీ పదేపదే పీడించి అడిగితే రాత్రి చెప్పక తప్పింది కాదు ఆ హోటల్ సింహాచలానిదని.

ఏడుస్తూ అలాగే పిచ్చితల్లి పడుకుండి పోయింది.

అన్నగా తనేం చేయగలడు.

బాధపడగలడు... ఏడవగలడు... చేతకాని తనానికి తలబాదుకోగలడు. కానీ ఏదీ కడుపు నింపదు. మరి ప్రయోజనం లేని పని చేయడమెందుకు. అందుకే ఆలోచిస్తున్నాడు.

కొత్త సినిమా విడుదలయిందని పోస్టర్లు తగిలించిన రిక్షా అరుపులతో, కేకలతో కాగితాలను విరజిమ్ముతూ పోతోంది.

ఓ కాగితం గాలికెగిరొచ్చింది. తీసి చూశాడు.

ఏమిటి లాభం? తనకి చదువూ రాదు. అయితే దానిమీద పెద్ద యాక్టరు బొమ్మను గుర్తుపట్టాడు.

అప్పుడెప్పుడో తనెళ్ళిన సినిమాలో కూడా అతనే హీరో.

పేదోడైనా మెరిసే బట్టలేశాడు. చదువు రాకపోయినా పాటలు పాడేడు. తిండి లేకపోయినా వందమందిని చితకబాదాడు. పెద్దింటి పిల్లని చేసుకుని వాసల్లో నానాడు. కానీ అవన్నీ చూస్తున్నప్పుడు ఏమిటిదంతా ఇలా వుందేమిటి అనిపించలేదు వెంకటేశానికి.

హుషారుగా చూసేశాడు. ఇంట్లో అమ్మకి, చెల్లికి కథ చెప్పాడు. ఒకసారి కాదు అయిదు సార్లు.

అమ్మపోయిన తరువాత అసలు సినిమానే చూడలేదు.

వెంకటేశం మరోసారి చూశాడు కాగితాన్ని. సింహాచలం కొట్టుదగ్గర ఈ సినిమా గురించే కాబోలు తెగ చెప్పుకునేవారు అప్పుడు.

కొత్తసినిమా కదా. జనం బాగా వుంటారన్న మాట.

అవును. ఇప్పుడు సింహాచలం కొట్టుకీ తనకీ ఏ విధమైన సంబంధమూ లేదు. తనకి రావలసిన పాతిక ముఖాన పడేసి పొమ్మన్నాడు.

ఆ పాతికా ఖర్చు చేస్తే ఈ రోజున తను తన చెల్లీ కడుపునిండా తినొచ్చు. మరి రేపో—

తనేరకంగా ఉపయోగపడతాడు పనికిరాని అభిమానాన్ని పెట్టుకుని—

ప్రశ్నించుకున్నాడు—

ఈ పాతికతో ఓ నాలుగు టిక్కెట్లు తీసి ఎక్కువ ధరకి అమ్మితే—?

మంత్రవాది మహేశ్వర్

నిజమే. తప్పేముంది. తనకి డబ్బు అవసరం. సినిమా అవసరం అనుకునే వాళ్ళు కొంటారు. తనేం మోసం చేయడం లేదే... 'మోసం' 'మంచి పనికాదు' అని ఎవరన్నా సలహా ఇచ్చినా పట్టించుకునే స్థితిలో లేడు తను.

ఆకలి మరోసారి వచ్చి 'లే' అని కర్తవ్యం గుర్తుచేసింది.

అదృష్టవశాత్తు వస్తున్న వీధి కుళాయి నీళ్ళు త్రాగి బయలుదేరాడు సినిమాహాలు వైపు.

రంగు రంగుల జండాలు... పెద్దబొమ్మలకి ఇంకా పెద్ద దండలు. హడావిడిగావుంది థియేటరంతా... విపరీతమైన జనం.

బుకింగ్ తెరవకముందే బ్లాకు టిక్కెట్ల అమ్మకం మొదలయిందేమిటన్న ఆలోచన వెంకటేశానికి లేదు—అతనికి తెలిసిందల్లా ఒక్కటే టికెట్లు సంపాదించాలి. ఎక్కువకి అమ్మాలి. ఆ హాల్లో అలా అమ్మడం తనకి తెలుసు. చూశాడు కనుక. కాసేపు అటు ఇటు తిరిగి ఆ జనంలో దూరిపోయాడు. తనలాగే మరో నలుగురైదుగురు భారీ శరీరాలవాళ్ళు దూరిపోయారు. వాళ్ళడిగినన్ని టికెట్లు ఇచ్చాడు అందరికి ఒక్కటి మించి ఇవ్వని కౌంటరువాడు. ఆ కంగారులో వాళ్ళల్లో ఒకడనుకుని వెంకటేశానికి నాలుగు టికెట్లు ఇచ్చేశాడు.... టిక్కెట్లు చేతిలో పడగానే పట్టరాని ఆనందం కలిగింది వెంకటేశానికి.

ఒక్కో టికెట్టు మీదా పది రూపాయల చొప్పున ఎక్కువ చేసి అమ్మినా జనం కొనేలాగున్నారు.. కొంటున్నారు.

నాలుగు టిక్కెట్లమీదా నాలుగు పదులు నలభై లెక్కేసుకున్నాడు.

భారతి భలే సంతోషిస్తుంది—

వెంకటేశానికి నమ్మకం ఏర్పడింది. బ్రతుకుమీద ఆశ కలిగింది. మనిషి తలుచుకోవాలే గానీ సాధించలేనిది లేదు అనిపించింది.

పావుగంటలో మూడు టిక్కట్లూ అమ్ముడైపోయాయి. ఇంకా ఒకటి— అది అమ్మేస్తే వెళ్ళిపోవచ్చు.

గంట క్రిందటిదాకా తనదగ్గర వున్నది—ఇప్పుడో—అది వారం రోజుల కష్టానికి ఫలితం. ఇదో కొద్దిపాటి సాహసం.


ఇలాంటి సాహసాలే ఎందరో చేస్తున్నారని, పెద్దపెద్ద మేడలకి, రంగు రంగుల కార్లకి ఇలాంటి చరిత్రలే వుంటాయని, పెద్దోళ్ళ వ్యవహారాలని పిచ్చి వెంకటేశం తనని చూసి లాఠీకర్రలతో తనవైపే వస్తున్న కాకీ దుస్తుల్ని గమనించలేదు.

'బక్కనా కొడకా... బ్లాకులో అమ్ముతావురా'—కర్రతో ఒక్కటిచ్చాడు. చేతుల్లోంచి డబ్బులు లాక్కున్నాడు.

మెడ పట్టుకుని ఒకే ఒక్క తోపు.. మూలకొచ్చి పడ్డాడు.

జనం ఎవరూ పట్టించుకోవడంలో లేరు. అందరి దృష్టి తమ అభిమాన నటుడిమీదే వుంది. సినిమా కూడా అప్పుడే మొదలైనట్టుంది. మొదట్లోనే స్టంటు సీను.

బ్లాకులో టిక్కెట్లు అమ్మడం తప్పు. అందుకు పోలీసులకు భయపడాలి. మరి— ఆ నలుగురూ పల్లిగ్గా పోలీసులతో మాట్లాడుకుంటూనే బ్లాకులో టిక్కెట్లు అమ్మేరే ఇంతసేపు... మరి వాళ్ళనేం అనలేదేం—ఏం బోధపడలేదు వెంకటేశానికి.




వాళ్ళు డబ్బులన్నీ లాగేసుకుని వెళ్ళిపోయినా, గుప్పిట్లో అమ్ముడుగాని టిక్కెట్టు నలిగిపోయి అలాగే వుంది.

లాగేసుకుని వెళ్ళిపోయిన డబ్బుల గురించి కన్నా ఈ ఒక్క టిక్కెట్టు రహస్యంగా అమ్మేసి ఎంతో అంత దక్కించుకుంటే చాలనుకున్నాడు. చెల్లికైనా తృప్తిగా భోజనం పెట్టొచ్చుననుకున్నాడు.

ఓ రెండడుగులు వేశాడో లేదో—

ఆ నలుగురు...బ్లాకులో టిక్కెట్లు అమ్మిన నలుగురూ... పోలీసులతో కులాసాగా కబుర్లు చెప్పిన నలుగురూ 'పట్టుకోండిరా బక్కోదవని' అంటూ ముందుకురికి అతుకుల చొక్కా కాలరు పట్టుకు లాగారు.

ఎన్నో తిట్లు తిట్టారు—ఒక్కదానికీ జవాబు లేదు.

కడుపులో గట్టిగా తన్నారు పిడికిలి బిగించి తలమీద కొట్టారు. నలిగిపోయిన టిక్కెట్టు లాక్కున్నారు... ఖాకీ దుస్తులు దూరం నుంచే చూసి, తమకేమీ పట్టనట్లు కిళ్ళీ కొట్టుదగ్గరకు పోయి బీడీలు వెలిగించుకుని మరీ వెళ్ళిపోయారు.

'బ్లాకులో టిక్కెట్టు అమ్మాడట'—గుసగుసలు వినిపించాయి జనంలోంచి. అయినా ఎవరికీ పట్టలేదు—

వెంకటేశానికి నోట్లోంచి, ముక్కులోంచి రక్తం కారుతుంది. 'వదిలేయండన్నట్లు రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టాడు వెంకటేశం.

మూగవాడు అంతకన్నా ఏం చేయగలడు.

ఆ పరిస్థితుల్లో దేవుడు రాయిగావుండాలన్నా వుండలేడేమో. మూగవాడిగా ఈ కుళ్ళు సమాజంలో పుట్టించి, బ్రతకలేని అవస్థను చూసి తనదగ్గరికి రప్పించుకునే ప్రయత్నంలో వున్నాడేమో.

ఇంతలో ఓ కారు అటుగా వచ్చింది.

'ఏమిటీ గొడవ' అనడిగింది ఠీరాగ్గా అందులోంచి ఓ ఖరీదైన కంఠం.

'ఏం లేదు సార్ ఈ బక్కోదవ బ్లాకులో టిక్కెట్లు అమ్ముతుంటేనూ—ఇంచుమించు నాలుగు కంఠాలు గరగరలాడాయి ఒక్కసారి.

'ఆ! అది సరే సి.ఐగారు ఫామిలీతో వస్తున్నారు. సీట్లుంచమని ఫోన్ చేశాను....''

'చేశాం సార్''

'ఓ.కె. ముందు వాడిని అవతలకి లాగి పారేయండి'— ఆర్డరు జారీ చేసేసి కారు మెత్తగా లోపలికి వెళ్ళిపోయింది.

కొత్తకుక్క ఏదైనా తమ వీధిలోకి వచ్చినట్లయితే, అక్కడున్న కుక్కలు ఊరుకోవు. అరుస్తాయి—తరుముతాయి—మీదపడి కరుస్తాయి—చంపేస్తాయి కూడా. బహుశా తమకు దొరికే తిండిలో అవి వాటా పంచుకోవడం ఇష్టం లేకే కావచ్చు. అదేం చిత్రమో వెంకటేశం చుట్టూ తిరిగే కుక్క తిండికోసం మరోచోటుకి వెళ్ళలేదు. వెంకటేశంలా వెళ్ళి దారుణమైన చావు చావలేకేమో. ఆ గుడిసె ఛాయల్లోనే చచ్చిపడి వుంది—వెంకటేశం ఇకరాడని తెలిసిపోయిందో ఏమో.

***        ***    ***

రాత్రి సుమారు తొమ్మిది గంటలవుతోందేమో. గుమ్మంలో కూర్చుని భారతి ఎదురు చూడటంలేదు.

అంతేకాదు—

గంటక్రితంవరకు తనుపెట్టిన కేకలు ఎవరికీ వినిపించలేదు. ఎవరికైనా వినిపించినా రక్షించలేరు అన్నది వేరే సంగతి.

పరిగెత్తింది.. గింజుకుంది... తిరగబడింది.

కానీ ఓడిపోయింది.

అమాయకత్వం మీద పశుత్వం గెలిచింది. దౌర్జన్యానికి ఆపూట ఆకలి తీరింది.

భారతి చేతికుండే గాజులు ముక్కలు ముక్కలయ్యాయి. ముక్కలైనవి చిమ్మబడి వున్నాయి. ఉన్న కొద్ది సామాను చెల్లాచెదురుగావుంది.

గురితప్పి భారతి చేతిలోంచి ఓ మూలవిసరబడ్డ కత్తిపీట
—మరోమూల ప్రాణంలేని 'రమ్'బాటిలు.
—నులకమంచంమీద ప్రాణం మాత్రమే వున్న భారతి.

తన నిజాయితిని చూపెట్టుకోవడానికన్నట్లు ఓ ఇరవై రూపాయల నోటు చేతిలోపెట్టి ఒళ్ళువిరుచుకుని గుడిసె బయటికొచ్చాడు సింహాచలం.

స్పృహ వచ్చాక భారతి బ్రతకాలనుకుంటుందో—బ్రతుకు  చాలించాలనుకుంటుందో.

ఈ గాంధీ పుట్టిన దేశంలో, నెహ్రూ కోరిన సంఘంలో, ఇందిరమ్మను కూల్చేసిన పవిత్ర భారతంలో ఆకలి కోసం ఆకలి తీరుస్తూ బ్రతుకీడుస్తున్న అనేకమంది చీకటి మనుషుల్లో తనూ ఒకర్తిగా మారుతుందో—

బ్రతికితే అదో చీకటి కథ.

బ్రతుకు చాలిస్తే ఓరోజు ఓ మూల పేపర్లో ఓ వార్త

○

## విరోధాభాస

మొండి చెట్టయినా చిగురిస్తుందేమోకానీ
ఈ రోడ్డు ఎంతకూ పుష్పించదు
సహారా సస్యశ్యామల మవుతుందేమోకానీ
ఈ జీవితం ఎంతకూ హసించదు

వసంతం ఎక్కడికీ పోదు
రోడ్డే నిరలంకారం అవుతుంది
పత్రహరితం హరిత మేఘమే అవుతుంది
జీవితం చేజారుతుంది

చూపు చొరబడిన నలుదిక్కులా
సిద్ధార్థుడి దుఃఖమే నన్ను కుదిపి వేస్తుంది
దుఃఖాశ్రువుల నడుమ
హసన్మందార మాలిక ఒదుగుతుందా?
చూపు రూపు రెండూ లోపలి మనిషివే,
అవి ప్రతీకలు లేని కవిత్వం లాంటివి
సంకీర్ణ జీర్ణ పత్రం లాంటివి
పుట తిరగేసిన ప్రతిసారీ
విరోధాభాస నన్ను విచలితుణ్ణి చేస్తుంది

— వంశీకృష్ణ

